మోడ్రన్‌గా సర్కారు బడి



ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల మైదానంలో కొత్తగా నిర్మిస్తున్న భవనం



పాత భవనానికి కొత్తగా అమర్చుతున్న కిటికీలు

- రూ.1.96 కోట్లతో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి
- ఆధునిక హంగులతో అదనపు భవన నిర్మాణం
- స్లైడింగ్ గేమ్స్‌తో ఆట స్థలం
- విద్యార్థులకు అనువుగా తరగతి గదులు, ఫర్నిచర్, డైనింగ్ హాల్, స్టేజ్...

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, సిటీస్ ప్రొగ్రాం కింద ఈ స్కూల్ పాత భవనం అభివృద్ధి, అదనపు భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల కోసం రూ.1.96 కోట్లు నిధులు మంజూరయ్యాయి. గతేడాది సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మార్చి నెలాఖరుకల్లా పనులు పూర్తయి అదనపు భవనం అందుబాటులోకి రానుంది.

కొత్త భవనంలో సకల సదుపాయాలు

కొత్తగా నిర్మిస్తున్న అదనపు భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు తరగతి గదులు, రెండు టాయిలెట్లు, పైఅంతస్తులో మూడు తరగతి గదులు నిర్మిస్తున్నారు. వాటిల్లో పిల్లలు కూర్చోడానికి అవసరమైన ఫర్నిచర్, బ్లాక్ బోర్డులు, నోటీస్ బోర్డులు, స్టోరేజీ యూనిట్స్, టాయిలెట్లకు నిరంతర నీటి సరఫరా, తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నారు. గ్రౌండ్‌లో సెమీ ఓపెన్ డైనింగ్ హాల్ కమ్ స్టేజ్, వాలీబాల్ కోర్టు, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు అనుగుణంగా లెరినింగ్ టైల్స్, స్కేల్, స్నేక్స్ అండ్ లేడర్స్, పాత్ వే పక్కన స్లైడింగ్ గేమ్స్‌తో ఆట స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

పాత భవంతికి కొత్త రూపు

ప్రస్తుతం స్కూల్ కొనసాగుతున్న పాత భవనం రూపురేఖలు కూడా మార్చివేస్తున్నారు. భవనం గోడలను పుట్టీ, పెయింటింగ్‌తో అందంగా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం పాత భవనంలోని కిటికీలు, ద్వారబంధాలను తొలగించి కొత్తవి, కిటీకీల చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నారు. విండోస్ గ్రిల్స్ అబాకస్ మోడల్‌లో అమర్చుతున్నారు.

మిన్నగా పాఠశాల అభివృద్ధి



గతంలో 130 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు, సంక్షేమ పథకాల అమలుతో స్కూల్‌లో విద్యార్థుల చేరిక బాగా పెరిగింది. ప్రస్తుతం 232 మంది చదువుతున్నారు. పేరెంట్స్ కమిటీ వినతి మేరకు పాఠశాల అవసరాలపై ఉన్నతాధికారులకు నివేదించాం. ఈ క్రమంలో స్మార్ట్ సిటీస్ ప్రొగ్రాంకు మా స్కూల్ ఎంపిక కావడంతో మేము కోరుకున్న దానికంటే మిన్నగా పాఠశాల అభివృద్ధి జరుగుతోంది.

– కె.పద్మజారాణి, హెచ్ఎం, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల

సీతమ్మధార రైతుబజార్ వద్ద పార్కింగ్ జోన్

- అక్కడి ఖాళీ స్థలంలో ఏర్పాటు చేయండి
- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశం



ప్లాన్ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజుబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ వద్ద ఉన్న జీవీఎంసీ ఖాళీ స్థలాన్ని పార్కింగ్ జోన్‌గా వినియోగించాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. జోన్–3 పరిధిలోని సీతమ్మధార రైతుబజార్ నుంచి ఏఎంజీ ఆస్పత్రి వరకు సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబజార్ వద్ద స్థలంలో పార్కింగ్ జోన్ ఏర్పాటుతోపాటు రోడ్డు ఆక్రమణలు తొలగించి నడక దారి నిర్మించాలన్నారు. వాహనాలను ఒక క్రమపద్ధతిలో పెట్టుకునేందుకు, ఆ పార్కింగ్ స్థలంలోనే అనువైన చోట్ల వాకర్స్‌కు నడక దారి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక టాయిలెట్లు నిర్మించాలన్నారు. ఈ పనులకు సబంధించి ప్లాన్‌ను పరిశీలించారు.

పరిశుభ్రంగా రైతుబజార్ పరిసరాలు

సీతమ్మధార రైతుబజార్‌లోని పరిసరాలను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించి, కాలువలోని పూడికలు తీయించాలని కమిషనర్ రాజాబాబు సూచించారు. బజార్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని, వ్యాపారులు, దుకాణదారులు వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లు ఇవ్వకుండా నిరోధించాలని ప్రజారోగ్యం అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధాన ఇంజనీర్ రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణరాజు, డీసీపీ పద్మజ, ఏసీపీ వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్ గెలుపునకు కృషి



45వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కంపా హనోకు



సమావేశంలో పాల్గొన్న 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, పార్టీ నాయకులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి వాసుదేవనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో వార్డు నాయకులతో సోమవారం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్‌ల వారీగా ప్రతి ఓటరును కలిసి వారితో మమేకమై, వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, రాజు యాదవ్, బాబూరావు, పైడి నాగరాజు, దుర్గేష్, సన్నీ, నాయుడు, కాయల నర్సింగ్, మాతా ఈశ్వర్, మహేష్, సబ్బవరపు సురేష్, రవిశంకర్, హరికృష్ణ, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష

మద్రిపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై 53వ వార్డు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కార్పొరేటర్ బర్కత్ అలీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చిలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్‌ల వారీగా ప్రతి ఒక్క ఓటర్‌ను కలిసి తమ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, ఈదుల రామారావు, షేక్ నబీ, లోక్‌నాథ్ పాత్రో, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ‘గ్రీవెన్స్’



వినతులు పరిశీలిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. వాటిని ఆయన పరిశీలించి కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించారు. మరి కొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు, పలువురు పార్టీ వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాల్ నంబర్ టోకెన్ అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు సోమవారం డ్రా తీశారు. ఉదయం, సాయంత్రం వేళ 63 స్టాళ్లకు మార్కెటింగ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు డ్రా తీసి రైతులు, వ్యాపారులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా రైతుబజార్ ఈవో కొండబాబు మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి సోమవారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రైతుబజార్‌కు సెలవు కావడంతో బుధవారం రైతులు వారికి కేటాయించిన స్టాళ్లల్లో వ్యాపారం నిర్వహిస్తారని చెప్పారు. రైతు బజార్ సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

వృద్ధుడికి ఆశ్రయం



వానప్రస్థ వృద్ధాశ్రమంలో శివరావు

మురళీనగర్: అక్కయ్యపాలెంలో దిక్కుతోచని స్థితిలో పడి ఉన్న ఒక వృద్ధుడికి పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమ నిర్వాహకుడు, మేనేజింగ్ ట్రస్టీ రొబ్బి శ్రీనివాసరావు సోమవారం ఆశ్రయం కల్పించారు. సరస్వతుల శివరావు అనే వృద్ధుడు పెరాలసిస్‌తో బాధపడు తూ నిరాశ్రయుడిగా రోడ్డు మీద పడి ఉన్న విషయాన్ని స్థానికులు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు తమ బృందంలో ఆ ప్రాంతానికి వెళ్లి వానప్రస్థ వృద్ధాశ్రమానికి వృద్ధుడిని తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. ఆయనకు వైద్య సేవలతోపాటు అన్ని సౌకర్యాలు అందిస్తామని శ్రీనివాసరావు చెప్పారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



80 ఫీట్ రోడ్డులో పాదయాత్ర చేస్తున్న గొంప గోవిందరాజు, పార్టీ శ్రేణులు

తాటిచెట్లపాలెం: కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులో హాత్ సే–హాత్ జో(చేయి చేయి కలుపుదాం –రాజీవ్‌గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం) అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని పాదయాత్ర చేశారు. పార్టీ నినాదాలతో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. పార్టీ విశాఖ జిల్లా పర్యవేక్షకులు మీసాల సుబ్బన్న, కిమిడి దేవిలతోపాటు వజ్రపత్తి శ్రీనివాస్, మూల వెంకటరావు, వేగి వెంకటేష్, గుత్తుల శ్రీనివాసరావు, అబిద, సుజాత, వైఎస్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కండి



టెన్త్ విద్యార్థులకు సూచనలిస్తున్న గొండు సీతారామ్

సీతంపేట: స్థానిక మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో సోమవారం ‘పరీక్ష పర్వ్’ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యం నింపేందుకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్, జిల్లా డైట్ సభ్యులు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ మాట్లాడుతూ పరీక్షలు జీవితంలో ఒక భాగమని, భయాన్ని వీడి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని పరీక్షలు రాయాలని సూచించారు. మోటివేషనల్ స్పీకర్ జగ్గారావు మాట్లాడుతూ మనల్ని మనం సెన్సిటైజేషన్ చేసుకుని స్థిరమైన మనస్సుతో పరిస్థితులను ఎదుర్కోవాలన్నారు. డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యాల నాయుడు మాట్లాడుతూ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాని కోసం కష్టపడాలని తెలిపారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు మాధవి, అల్లావుద్దీన్, మోటివేషన్ స్పీకర్ గిరి ప్రసాద్, సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు బి.శంకుల, కె.లవకుశ, ప్రవీణ, పాఠశాల ప్రధానోపాధ్యాయి శాంతికుమారి, ఎడ్యుకేషన్ సెక్రటరీలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

‘స్పందన’కు 15 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకర చెట్ల కొమ్మల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



గంగన్ననగర్‌లో చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు జోగారావునగర్, యల్లబిల్లివారి వీధి, గంగన్ననగర్, కొత్త రెడ్డికంచరపాలెం నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ నేతాజీ వంతెన జంక్షన్‌కు వెళ్లే రహదారుల్లో విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను ఎట్టకేలకు తొలగించారు. ఆయా ప్రాంతాల్లోని చెట్ల కొమ్మల్లో విద్యుత్ తీగలు చిక్కుకుని ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దీంతో అటుగా ప్రయాణించే పాదచారులు, వాహన చోదకులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఈ నెల 7న ‘కరెంటు తీగలతో కలవరం’ అనే శీర్షికన ‘సాక్షి’లో వెలువడిన కథనానికి ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు డీఈఈ కోటేశ్వరరావు, ఏఈ బి.వీర్రాజుల పర్యవేక్షణలో సిబ్బంది తొలగింపు చర్యలు చేపట్టారు.

రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

- ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ స్పెషల్ డ్రైవ్



విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ విశాల్ గున్ని ఆదేశాలతో, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.వి.ఎస్.నాగేశ్వరరావు సూచనలతో సోమవారం విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు(జీఆర్పీ) స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో, ప్లాట్‌ఫారాలపై, వివిధ రైళ్లు, వెయిటింగ్ హాల్స్, పార్సిల్ కార్యాలయాల వద్ద గంజాయి, స్మగ్లింగ్, నిషేధిత డ్రగ్స్ కోసం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో జీఆర్పీ సిబ్బందితోపాటు ఆర్పీఎఫ్ ఎస్ఐ చంద్రమోహన్, ఏఎస్ఐ అనంతరావు, డాగ్ స్క్వాడ్ పాల్గొన్నాయి.

గంజాయి పట్టివేత..

ఈ తనిఖీల్లో భాగంగా విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 3 వద్ద అనుమానిత, వదిలేసిన లగేజీని రైల్వే పోలీసులు తనిఖీ చేయగా.. దీనిలో 10 కేజీల గంజాయి ఉన్నట్లు కనుగొని, సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోసం దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ సీఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

బాలికలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం



కంప్యూటర్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

తాటిచెట్లపాలెం: ధరణి సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ రైట్స్ అండ్ యూ(క్రై) సంస్థ సహకారంతో కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సును రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ కె.ఎస్.ఎం.జి.హైస్కూల్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ కోర్సులో కంప్యూటర్, ఐటీకి సంబంధించి కనీస పరిజ్ఞానం కల్పిస్తామని నిర్వాహకులు చెప్పారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్(స్టెమ్)పై బాలికలకు ఆసక్తి కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా శిక్షణను ఇస్తున్నట్లు ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి తెలిపారు. బాలికలు ఉన్నత విద్యలో రాణించడానికి సాంకేతిక పరిజ్ఞానం, ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమెటిక్స్‌ల్లో నైపుణ్యం సంపాదించాలని సూచించారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణకు 95 మంది బాలికలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.రాము, ఉపాధ్యాయిని గ్లోరీ, ధరణి సంస్థ ప్రతినిధులు రమాదేవి, కృష్ణకుమారి, స్టెమ్ ప్రాజెక్టు టీచర్లు ఐశ్వర్య, సాయి లక్ష్మి పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో నీళ్ల ట్యాంకు ఏర్పాటు



కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో కొత్తగా నీళ్ల ట్యాంకు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న ట్యాంకు వాకర్స్ అవసరాలు తీర్చడానికి సరిపోయేది కాదు. దీంతో టాయిలెట్లకు రన్నింగ్ వాటర్ పూర్తి స్థాయిలో సరఫరా చేయడంతోపాటు ఇతర నీటి అవసరాలు తీర్చడానికి వీలుగా వెయ్యి లీటర్ల తాగునీటి ట్యాంకును అందుబాటులోకి తెచ్చారు. నీటి వృథాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మహిళల కోసం ప్రత్యేకంగా టాయిలెట్లు ఏర్పాటు చేసినట్లు పార్కు నిర్వాహక కమిటీ తెలిపింది.

ప్రాచీన జ్యోతిష్య గ్రంథాల ఆవిష్కరణ



గ్రంథాలు ఆవిష్కరిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

సీతంపేట: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా అత్యంత ప్రాచీన జ్యోతిష్య గ్రంథాల ఆవిష్కరణ జరిగాయి. పాతగాజువాక జ్యోతిష సరస్వతి పీఠం, ప్రముఖ జ్యోతిష్య పండితుడు నాగులకొండ ఆశ్లేషాచార్య సిద్ధాంతి రచించిన మూడు జ్యోతిష్య గ్రంథాలను సోమ వారం శంకరమఠంలో స్వామి ఆవిష్కరించారు. 13వ శతాబ్దానికి చెందిన ప్రముఖ ప్రశ్న గ్రంథం ‘భువన దీపిక’, 15వ శతాబ్దానికి చెందిన ప్రముఖ ప్రశ్న గ్రంథం ‘ప్రశ్న జ్ఞాన ప్రదీప’, మహాపండిత డాక్టర్ సుఖదేవ చతుర్వేది ప్రణీత ‘మూక ప్రశ్న విచార’ గ్రంథాలు ఎంతో వివరణతో అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఆశ్లేషాచార్యులు తెలుగులోకి అనువదించారు. ఈ గ్రంథాలు ఎంతో విశిష్టమైనవని శంకర స్వామి ప్రశంసించారు. లోక కల్యాణార్థం రచించిన ఈ గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదివి ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని ప్రజలందరూ సుఖమయ జీవితాన్ని గడపాలని పీఠాధిపతి ఆకాంక్షించారు. కార్యక్రమంలో జ్యోతిష్య పండితులు మధురపాల శంకరశర్మ, పుచ్చా శ్రీనివాసరావు, కొప్పరవు కవుల మనవడు మా శర్మ, మోహన్ పబ్లికేషన్స్ అధినేత రామచంద్రరావు, నాగులకొండ సూర్యాచారి తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాల, గోశాల నిర్వహణ సంతృప్తికరం



కంచి పీఠాధిపతికి సింహాద్రినాథుడి చిత్రపటాన్ని అందిస్తున్న గంట్ల శ్రీనుబాబు

సీతంపేట: శంకరమఠంలో విడిదిచేసిన కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతిని సోమవారం వీజేఎఫ్ అధ్యక్షుడు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సింహాద్రినాథుడి చిత్రపటాన్ని స్వామికి బహూకరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ 1988 తర్వాత ఇటీవలే సింహాచలం ఆలయాన్ని దర్శించనన్నారు. ఆలయంలో శాసనాలను పరిశీలించానని, వేద పాఠశాల, గోశాల నిర్వహణ బాగుందని కితాబిచ్చారు. అక్షయ తృతీయ, చందనోత్సవం సందర్భంగా సింహాచలం దేవస్థానంలో వెయ్యి మందితో నృశింహ కరావలంబ స్తోత్రం, నృశింహ పంచరత్నం, లక్ష్మీ అష్టకం, నిత్యనారాయణ శ్లోకాలు, మైత్రీ పూజిత మంగళ శ్లోకాలు, రామచంద్రాయ జనక శ్లోకాలు ఆలపిస్తారని, ఇందు కోసం తమ పరివారానికి అవసరమైన సూచనలు చేసినట్టు స్వామి తెలిపారు.

పబ్లిక్ డిమాండ్

భరించ లేని దుర్వాసన



శ్రీనివాసనగర్‌లో లీకవుతున్న మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని దాడి రామ్మూర్తి కల్యాణ మండపం వెనుక రోడ్డులో పీఆర్‌కే నాగ్ ఆనంద్ హైట్స్ అపార్ట్‌మెంట్ ఎదుట యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. దాని నుంచి మలమూత్రాలు బయటకు పొంగి పొర్లడంతో విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. ఆ మార్గంలో వెళ్లాలంటే ముక్కు మూసుకొని నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిసర ప్రాంతవాసులు దుర్వాసన భరించలేక ఇళ్లల్లో ఉండలేక పోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలి.

– జి.వెంకటరావు, శ్రీనివాసనగర్

తాగునీరు మురుగుమయం



మద్రిపాలెం మెయిన్ రోడ్డులో పైకప్పు లేని కాలువ



బురద రంగులో బోరు నీరు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం బీఆర్‌టీఎస్ మెయిన్ రోడ్డులోని కాలువ దుర్గంధభరితంగా మారింది. ప్రధానంగా అక్కడ డ్రెయిన్ పైప్‌లైన్ ద్వారా మురుగు నీరు సమీపంలోని ఇళ్ల బోరు ద్వారా తాగునీటిలోకి ప్రవేశిస్తోంది. దీంతో తాగునీరు పడుతుంటే బురద రంగులో వస్తూ కంపు కొడుతోందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై రెండు నెలలుగా ఫిర్యాదులు చేస్తున్నా.. శానిటేషన్ సిబ్బంది వచ్చి చూసి తమ వార్డు పరిధి కాదని చెప్పి వెళ్లిపోతున్నారని స్థానికులు, వ్యాపారులు ఆరోపిస్తున్నారు. కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటం, అందులో ఎలుకలు తదితర జీవాలు తిరగడం, నిత్యం తిరుగుతున్న దారిలో ఉండటంతో అనారోగ్యానికి గురవుతామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దళిత సేన నిరసన



నిరసన తెలుపుతున్న దళిత సేన నేత గొల్లమాల అప్పారావు, ప్రతినిధులు

కంచరపాలెం: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ నుంచి మృత శిశువుతో ద్విచక్ర వాహనంపై గిరిజన కుటుంబీకులు వెళ్లిన అమానుష ఘటనపై దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినప్పటికీ కనీసం అంబులెన్స్ సౌకర్యం కల్పించని దుశ్చర్యను దళిత సేన తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సమాచార లోపం కారణంగా గిరిజనులకు అవస్థలు తప్పడం లేదని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎస్టీ సెల్‌ను పునరుద్ధరించాలని అప్పారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర కన్వీనర్ గొల్లమాల మీనా, పుచ్చా కామేశ్వరరావు, తాటిపూడి సీతారాం, పట్నాల ఝాన్సీ, రాణి, జయకుమార్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌లో ప్రవేశం పొందిన వారికి మార్చి 20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏయూ టీడీఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలియజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమ వారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి విడుదల చేశారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షకు ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఏయూ టీడీఆర్ వెబ్‌సైటులో సంబంధిత వివరాలు నమోదు చేసి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, సబ్జెక్టుల వారీగా పరీక్ష తేదీలు త్వరలో వెల్లడిస్తామన్నారు.